క్లుప్తంగా

కనకదుర్గ ఆలయ ఆదాయం రూ.58 వేలు



హుండీ కానుకలను లెక్కిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్: పాత బ్రిడ్జి రోడ్డులోని కనక దుర్గ అమ్మవారి దేవాలయం హుండీ కానుకల ఆదాయం రూ.58,722 ఆదాయం వచ్చినట్లు ఈఓ శ్యామలరావు తెలిపారు. 77 రోజులకు సంబంధించిన ఆదాయాన్ని మంగళవారం లెక్కించినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఈఓ, ఆలయ ధర్మకర్త, అర్చకులు, పెద్దలు పాల్గొన్నారు.

నేడు కళాకారుడికి సన్మానం

శ్రీకాకుళం కల్చరల్ : ప్రపంచ రంగస్థల దినోత్సవం సందర్భంగా రంగస్థల కళాకారుల సమాఖ్య నెలవారీ సాంస్కృతిక విభాగం ఆధ్వర్యంలో బుధవారం 'ముంగిట సన్మానం' కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు చిట్టి వెంకటరావు, ఎల్.రామలింగస్వామి, పన్నాల నర్సింహమూర్తి, బి.రామచంద్రదేవ్ ఒక ప్రకటనలో తెలిపారు. జాతీయ మిమిక్రీ కళాకారుడు ఎల్.నందికేశ్వరరావు ఇంటి వద్దకు ఉదయం 9 గంటలకు వెళ్లి సత్కారం చేస్తామని పేర్కొన్నారు. ప్రతి ఏడాది సీనియర్ కళాకారుల ఇంటికి వెళ్లి సత్కారాలు చేస్తున్నట్లు తెలిపారు.

వాండ్రంగిలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్లు

జి.సిగడాం: మండలంలోని వాండ్రంగి గ్రామంలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. జి.సిగడాం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి బి.యశ్వంత్ ఆధ్వర్యంలో సిబ్బంది రోగులకు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. అనంతరం రోగులకు మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ సాకేటి నాగరాజు, సూపర్‌వైజర్ భాస్కరరావు, హెల్త్ అసిస్టెంట్ పేడాడ సత్తెరాజు, ఏఎన్ఎం అన్నపూర్ణ, ఎంఎల్‌హెచ్‌పీ సంధ్యారాణి, ఆశా కార్యకర్తలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

శతశాతం రికవరీలు చేపట్టాలి



మాట్లాడుతున్న రవికుమార్

ఎచ్చెర్ల : స్వయం సహాయక సంఘాల మహిళలకు అందించిన బ్యాంక్ రుణాల రికవరీలు శతశాతం చేపట్టాలని వెలుగు ప్రాంతీయ సమన్వయకర్త పి.రవికుమార్ అన్నారు. మంగళవారం ఎచ్చెర్ల వెలుగు కార్యాలయంలో సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్థిక సంవత్సరం ముగియనుందని, లావాదేవీలు వెంటనే సరిచేసి ప్రణాళికలు పూర్తి చేయాలని సూచించారు. స్త్రీ నిధి ద్వారా ఎచ్చెర్లలో రూ.23.31 కోట్లు, లావేరులో రూ. 23.18 కోట్లు, రణస్థలంలో రూ.21.66 కోట్లు, జి.సిగడాంలో రూ.14.47 కోట్లు, పొందూరు లో రూ.9.76 కోట్లు, ఆమదాలవలసలో రూ. 13.77 కోట్లు రుణాలు అందించినట్లు వివరించారు.

ఉన్న మాటంటే ఉలుకెందుకో..?

శ్రీకాకుళం: శ్రీకాకుళం అసెంబ్లీ నియోజకవర్గం నుంచి తెలుగుదేశం పార్టీ అభ్యర్థిత్వం ఖరారైన గొండు శంకర్ ఇటీవల చేసిన వ్యాఖ్యలను 'సాక్షి'లో మంగళవారం ప్రచురించడంపై ఆయన అక్కసు వెళ్లగక్కారు. ఇటీవల ఓ ఛానెల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో పార్టీ జెండా కప్పుకుని అన్యాయం చేస్తే ఊరుకోనని, ఇటువంటి పప్పులు తన వద్ద ఉడకవని చెప్పడం, ఎవరైనా అన్యాయం చేస్తే రోడ్డుకీడుస్తానని, అస్త్రశస్త్రాలు సిద్ధం చేసుకునే బరిలోకి వచ్చానని వ్యాఖ్యానించారు. పార్టీలోఉన్న ప్రతి ఒక్కరూ పనిచేయాల్సిందేనని హెచ్చరిక ధోరణిలో మాట్లాడటమే కాకుండా ఇదే విషయాన్ని గతంలో ఓ ఛానెల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో కూడా చెప్పానని పేర్కొన్నారు. ఈ విషయాలను సాక్షి ప్రచురిస్తే తనపై సాక్షి దుష్ప్రచారం చేస్తోందని, తెలుగుదేశం క్యాడర్‌ను విడదీయాలని చూస్తోందంటూ మంగళవారం ఓ వీడియోను ప్రసార మాధ్యమాల్లో పంపించినప్పటికీ దానిని చూసిన ఏ ఒక్కరూ హర్షించడం లేదు. రాష్ట్ర రాజకీయాల్లో కొత్త శకం మొదలైందని టీడీపీ, జనసేన, బీజేపీల ఉమ్మడి అభ్యర్థి గొండు శంకర్ అన్నారు. మంగళవారం నగరంలో ఓ ప్రైవేటు హోటల్‌లో ఉమ్మడి పార్టీల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుండ దంపతులను కలుపుకొని ముందుకు వెళ్తానన్నారు.

పటిష్టంగా ఎన్నికల కోడ్ అమలు

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల మండలంలో పటిష్టంగా ఎన్నికల కోడ్ అమలు చేస్తున్నట్లు తహశీల్దార్ వి.శ్యాంకుమార్ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ఎనిమిది నియోజకవర్గాల ఈవీఎంలు భద్రపర్చే స్ట్రాంగ్ రూం, డిపాజిట్ కేంద్రాలు, కౌంటింగ్ కేంద్రాల ఏర్పాట్లు చిలకపాలెంలోని శ్రీ శివానీ ఇంజినీరింగ్ కాలేజ్‌లో జరుగుతున్నట్లు తెలిపారు.

జంక్షన్లలో ఆంక్షలు!

- శ్రీకాకుళంలోని రద్దీ ప్రాంతాలపై దృష్టి పెట్టిన ట్రాఫిక్ పోలీసులు
- ఆటోలు, తోపుడుబళ్ల వ్యాపారులకు సూచనలు
- తొలగిన ట్రాఫిక్ ఇబ్బందులు



వాహనాలు తీశాక డేఅండ్ నైట్ కూడలి నుంచి ఇలిసిపురం మీదుగా వెళ్లే మార్గం



వెటర్నరీ హాస్పిటల్ మార్గంలో ఎస్ఐ ప్రసాదరావు తమ సిబ్బందితో ద్విచక్రవాహనాలను తీయిస్తూ..

శ్రీకాకుళం క్రైమ్ : మీ ఉపాధికి అడ్డురాం.. ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించకండి.. జనాలకు ఇబ్బంది కలిగించేలా ప్రవర్తించకండి అంటూ ట్రాఫిక్ పోలీసులు ఆటోడ్రైవర్లు, తోపుడుబళ్ల వారిని, ఎక్కడికక్కడ పార్కింగ్ చేసే ద్విచక్ర వాహనదారులకు సూచించారు. వారు కూడా ఇబ్బందిలేని చోట నిలపడంతో జిల్లా కేంద్రంలో నిత్య రద్దీప్రాంతాల్లో ట్రాఫిక్ కష్టాలు తొలగాయి. అటుగా పోయేవారు ఈ కొద్దిరోజుల్లో జరిగిన మార్పు పట్ల సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

● అంబేద్కర్ కూడలి- ఆర్ట్స్ కళాశాల, అంబేద్కర్ కూడలి-వెటర్నరీ ఆస్పత్రి, డే అండ్ నైట్ కూడలి-ఇలిసిపురం, ఏడు రోడ్ల కూడలి- ఎన్టీఆర్ మున్సిపల్ హైస్కూల్ తదితర మార్గాల్లో టిఫిన్ సెంటర్లు, హోటళ్లు, పండ్ల దుకాణాలు, తోపుడు బళ్లు, ఆసుపత్రుల సముదాయం ఎక్కువగా ఉండటంతో ఇదివరకు పదుల సంఖ్యలో కార్లు, ద్విచక్రవాహనాలు అడ్డదిడ్డంగా పెట్టేసేవారు. ట్రాఫిక్ సీఐ అవతారం, ఎస్ఐ పి.ప్రసాదరావు, ఏఎస్ఐ వాసు, హెచ్‌సీ ఎం.ప్రకాష్, హెడ్ కానిస్టేబుల్ ఎం.ఉమాశంకర్, పీసీ పి.భాస్కర్, కానిస్టేబుల్ బి.ప్రకాషరావు తదితర సిబ్బంది ప్రత్యేకంగా దృష్టి సారించడంతో ట్రాఫిక్ ఇబ్బందులు తొలగి ఆయా మార్గాలు సువిశాలంగా కనిపిస్తున్నాయి.



సువిశాలంగా అంబేద్కర్ కూడలి నుంచి ఆర్ట్స్ కళాశాలకు వెళ్లే మార్గం



వాహనాలు తీశాక అంబేద్కర్ కూడలి నుంచి వెటర్నరీ హాస్పిటల్‌కు వెళ్లే మార్గం



ఏడురోడ్ల కూడలి ఎన్టీఆర్ మున్సిపల్ స్కూల్ సమీపంలో..

గుడారిపోలమ్మ విగ్రహ ప్రతిష్టాపనోత్సవాలు ప్రారంభం



గుడారి పోలమ్మ అమ్మవారి విగ్రహం ఊరేగింపు



ఆకట్టుకున్న తప్పెటగుళ్ల కళాకారుల ప్రదర్శన

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని న్యూకాలనీలో ఉన్న సత్యసాయి మందిరం పక్కన ఉన్న గుడారి పోలమ్మ తల్లి పునఃప్రతిష్టాపన ఉత్సవాలు మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. దుర్గా మహాలక్ష్మీ ఆలయ ప్రధాన అర్చకులు తెన్నేటి విద్యాధరశాస్త్రి ఆధ్వర్యంలో భక్తులు అమ్మవారి విగ్రహాన్ని మేళతాళాలతో ఊరేగించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కోలాటం, తప్పెటగుళ్ల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ నెల 27న అమ్మవారి విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో మసీదుపాలెం గుడారి పోలమ్మ యువజన సంఘం, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మదీనా బాబా చందనోత్సవం నేడు



మదీనాబాబా సమాధి

గార: మండలంలోని కళింగపట్నంలో మదీనా దర్గా ఉర్సు ఉత్సవం (చందనోత్సవం) బుధవారం నిర్వహించనున్నారు. రంజాన్‌లో నెలవంక ప్రారంభమైన 16వ రోజున ముస్లింలు భక్తిశ్రద్ధలతో ఈ ఉత్సవం జరుపుతారు. గురువారంతో ఉత్సవం ముగియనుందని హజరత్ కళింగ మదీనాబాబా దర్గా కమిటీ సభ్యులు తెలిపారు. 11వ శతాబ్దంలో పవిత్ర మక్కా నగరం నుంచి మదీనా బాబా ఇక్కడికి వచ్చి తర్వాత రోజుల్లో ఇక్కడే జీవసమాధి పొందారని, హిందూ ముస్లింల సమైక్యతకు వారధిగా నిలుస్తోందని చెప్పారు. విలువైన వస్తువులు పోగొట్టుకున్న సమయాల్లో బాబాకు మొక్కుకుంటే అవి దొరకుతాయని ఈ ప్రాంతీయుల బలమైన నమ్మకం.

విస్తృతంగా వాహనాల తనిఖీ



జీరుపాలెంలో వాహనాలు తనిఖీ చేస్తున్న సిబ్బంది

రణస్థలం: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నట్లు ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం ఏఓ పి.గాయిత్రి, ఏఎస్సై ఎ.వి.జి.కృష్ణారావు తెలిపారు. పైడిభీమవరం, పాతర్లపల్లి, రావాడ, కోష్ట తదితర ప్రాంతాల్లో మంగళవారం వాహనాల తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అక్రమంగా మద్యం, నగదు, బహుమతులు వంటి వస్తువులు తీసుకువెళ్లరాదని చెప్పారు. అలాగే వాహన పత్రాలు సక్రమంగా ఉండాలని సూచించారు.

ఇంటర్‌లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం



ప్రిన్సిపాల్ డేనియల్

ఎచ్చెర్ల : లావేరు మండలం తామాడ ఆదర్శ పాఠశాల/కళాశాలలో 2024 - 25 విద్యా సంవత్సరానికి ఇంటర్మీడియెట్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశానికి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ జి.డేనియల్ మంగళవారం తెలిపారు. ఇంగ్లిష్ మీడియంలో బైపీసీ, ఎంపీసీ గ్రూపుల్లో ప్రవేశం కల్పించనున్నామని పేర్కొన్నారు. పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ నెల 28 నుంచి మే 22 వరకూ ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుని జిరాక్స్ కాపీని కళాశాల కార్యాలయంలో అందజేయాలన్నారు. మార్కుల మెరిట్ రిజర్వేషన్ మేరకు ప్రవేశాలు కల్పిస్తామన్నారు. వివరాలకు 9989108474 నంబరున్ సంప్రదించాలని కోరారు.

టీడీపీ అభ్యర్థి శిబిరంలో డిపో డీలర్



శంకర్‌తో కరచాలనం చేస్తున్న డిపో డీలర్ మిన్నారావు

గార: శ్రీకాకుళం నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి గొండు శంకర్ బుధవారం కళింగపట్నంలో నిర్వహించనున్న ఆత్మీయ కలయికకు సంబంధించి ముందస్తుగా మంగళవారం కళింగపట్నం ప్రజాప్రతినిధులను కలిశారు. మాజీ సర్పంచ్ పొట్నూరు కృష్ణమూర్తి నివాసానికి వెళ్లి సమావేశం నిర్వహించారు. ఇందులో 34వ డిపో డీలర్ పొట్నూరు మిన్నారావు కూడా పాల్గొన్నారు. ఎన్నికల నిబంధనల మేరకు డీలర్ ఏ పార్టీ శిబిరంలోనూ పాల్గొనకూడదు. ఈ విషయమై స్థానికులు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయగా, విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని తహశీల్దార్ ఎం.శ్రీను, ఎంపీడీవో కళ్యాణి తెలిపారు.

ప్రచారాలకు అనుమతులు తప్పనిసరి

శ్రీకాకుళం పాతబస్టాండ్: శ్రీకాకుళం శాసన సభ ఎన్నికల సందర్భంగా శ్రీకాకుళం నగరం, మండలంలో రాజకీయ పార్టీల అభ్యర్థులు ప్రచార కార్యక్రమాలు నిర్వహించే ముందు తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలని ఈఆర్వో రాణి మంగళవారం పేర్కొన్నారు. సభలు, ర్యాలీలు, ఊరేగింపులు, ఫ్లెక్సీలు, లౌడ్‌స్పీకర్లు, కరపత్రాల పంపిణీ తదితర అనుమతులను సువిధ యాప్ నుంచి పొందవచ్చని తెలిపారు.

ఘనంగా గ్రామదేవత ఉత్సవం



ఘటాలతో వెళ్తున్న మహిళలు

గార : శ్రీకాకుళం రూరల్ మండలం ఒప్పంగిలో గ్రామ దేవతా ఉత్సవం కనుల పండువగా జరిగింది. మంగళవారం ఇంటికో ఘటం చొప్పున మహిళలు అమ్మవారి ఆలయం వద్దకు వెళ్లి చల్లదనం చేసి మొక్కులు తీర్చుకున్నారు. రాత్రి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

'ప్రకృతి' కూరగాయల విక్రయం



కూరగాయలు విక్రయిస్తున్న రైతులు

ఎచ్చెర్ల క్యాంపస్: మండల పరిషత్ కాంప్లెక్ ఆవరణలో ప్రకృతి వ్యవసాయం పద్ధతిలో పండించిన కూరగాయలను ఎస్ఎం పురంపేట రైతులు మంగళవారం విక్రయించారు. వీరు ప్రతి సోమవారం ఈ కూరగాయలు విక్రయిస్తుంటారు. సోమవారం హోలీ సెలవు కావడంతో మంగళవారం అమ్మకం చేపట్టారు. రసాయన, పురుగు మందులు వాడకుండా సేంద్రియ ఎరువులు వాడి కూరగాయలు పండించి విక్రయిస్తున్నట్లు ప్రకృతి వ్యవసాయం లీడ్ ఫార్మర్ మెట్ట ధనుంజయరావు తెలిపారు.

తక్కువ బరువున్న చిన్నారులపై శ్రద్ధ

శ్రీకాకుళం అర్బన్: అంగన్‌వాడీ కేంద్రాలకు వస్తున్న చిన్నారులు తక్కువ బరువు ఉంటే ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఐసీడీఎస్ శ్రీకాకుళం అర్బన్ ప్రాజెక్టు కృష్ణా పార్క్ సెక్టార్ సూపర్‌వైజర్ పి.సీతామహాలక్ష్మి తన పరిధిలోని అంగన్‌వాడీ సిబ్బందికి సూచించారు. మంగళవారం శ్రీకాకుళంలోని కృష్ణాపార్కు సెక్టారు కత్తెరవీధి-2 అంగన్‌వాడీ కేంద్రంలో సెక్టార్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత నెలలో తక్కువ బరువు ఉన్న చిన్నారులను గుర్తించి ఈనెలలో వారి బరువు తేడాలను గమనించాలన్నారు. ఎంపీఆర్, ఎఫ్‌సీఆర్‌లలో లబ్ధిదారులకు అందించిన ఫీడింగ్ ఖర్చులను సరిచూశారు. ఎండ తీవ్రత పెరుగుతున్న దృష్ట్యా పిల్లల పట్ల శ్రద్ధ చూపాలన్నారు. అంగన్‌వాడీలు సమయపాలన పాటించాలన్నారు. సమావేశంలో 35 కేంద్రాల అంగన్‌వాడీలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వేసవి పంటలతో ప్రయోజనం



విత్తనాలు పంపిణీ చేస్తున్న రెడ్డీస్ ఫౌండేషన్ ప్రతినిధులు

సరుబుజ్జిలి: రబీ సీజన్లో మొక్కజొన్న పంట అనంతరం పొలాలను ఖాళీగా ఉంచకుండా వేసవి పంటలను వేయడం వల్ల భూగర్భ జలాలను పరిరక్షించవచ్చునని డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ ఏరియా మేనేజర్ పి.తవిటినాయుడు తెలిపారు. మండలంలోని వీరమల్లిపేట, సవలాపురం జంక్షన్, రొట్టవలస గ్రామాల్లో రైతులు వేసవి పంటలు వేసుకునేందుకు మినుము, నువ్వు విత్తనాలు మంగళవారం ఉచితంగా పంపిణీ చేశారు. రెడ్డీస్ ఫౌండేషన్ సమన్వయకర్త ఎ.లావణ్య, రైతులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీనే గెలిపిద్దాం



బాతువ గ్రామంలో ప్రచారం నిర్వహిస్తున్న పరిమళ

జి.సిగడాం: ఎచ్చెర్ల ఎమ్మెల్యేగా గొర్లె కిరణ్‌కుమార్‌ను గెలిపించి జగనన్నకు కానుకగా ఇద్దామని ఎమ్మెల్యే సతీమణి గొర్లె పరిమళ అన్నారు. మంగళవారం బాతువ గ్రామంలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి వైఎస్సార్‌సీపీని గెలిపిద్దామని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా వృద్ధులను ఆప్యాయంగా పలకరించారు. కార్యక్రమంలో ఎంపీపీ మీసాల సత్యవతి, మండల పరిషత్ ప్రత్యేకాహ్వానితుడు మీసాల వెంకటరమణ, జెడ్పీటీసీ కాయల రమణ, మండల బూత్ కన్వీనర్ ఆబోతుల జగన్నాథం, ఏఎంసీ కన్వీనర్ డోల వెంకటరమణ, మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు వాన ప్రమీల, మండల మహిళా కన్వీనర్లు కంది రమాదేవి, గురాన మానస, ఎంపీటీసీ బూటు దమయంతి, బూటు అప్పారావు, కుదిరెళ్ల సుజాత, తిరుమరెడ్డి విజయలక్ష్మి, కుమరాపు కుమారి, శ్రీనివాసరావు, రమణ, లక్ష్మణరావు, పీఏసీఎస్ చైర్మన్ పల్లేడ సన్యాసిరావు, మామిడి బలరాం, బాలి రమేష్‌నాయుడు, ఎం.ఆదిత్య వర్మరాజు తదితరులు పాల్గొన్నారు.

తెలగ కులస్తులను బీసీల్లో చేర్పించాలి



విద్యార్థికి ఆర్థిక సహాయం అందిస్తున్న తెలగ సంఘ నాయకులు

ఎచ్చెర్ల: ఉత్తరాంధ్ర తెలగ కులస్తులను బీసీల్లో చేర్పించాలని ఉత్తరాంధ్ర తెలగ కుల సంఘం నాయకుడు పల్లంటి వెంకటరాము (పీవీఆర్) కోరారు. మంగళవారం లావేరులో నాలుగు మండలాలకు చెందిన తెలగ కులస్తులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బీసీల్లో చేర్పిస్తామని స్పష్టమైన హామీతో పార్టీలు మేనిఫెస్టో విడుదల చేయాలన్నారు. అనంతరం స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగం సాధించిన పొందూరు గ్రామానికి చెందిన తెలగ కుల విద్యార్థికి రూ.50 వేలు సాయం అందించారు. కార్యక్రమంలో సంఘ నాయకులు లంకలపల్లి ప్రసాద్, ముప్పిడి సురేష్, ఇనపకుర్తి తోటయ్యదొర, దొెట్టి తిరుపతిరావు, పైడి శ్రీనివాసరావు, పాలబొమ్మ చిన్నశ్రీను, కంది శ్రీనివాసరావు, అప్పుదొర తదితరులు పాల్గొన్నారు.

ఈయూతోనే ఆర్టీసీ ఉద్యోగుల సమస్యల పరిష్కారం



మాట్లాడుతున్న ఈయూ రాష్ట్ర అధ్యక్షుడు పలిశెట్టి దామోదరరావు

శ్రీకాకుళం అర్బన్: ఏపీఎస్ ఆర్టీసీ ఉద్యోగుల సమస్యల సమస్యల పరిష్కారానికి కృషిచేసింది ఎంప్లాయీస్ యూనియన్ మాత్రమేనని సంఘ రాష్ట్ర అధ్యక్షుడు పలిశెట్టి దామోదరరావు అన్నారు. విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల పీటీడీ ఎంప్లాయిస్ యూనియన్ సమావేశం విజయనగరం సీపీఐ కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టీసీ ఉద్యోగులకు త్వరలోనే లామినేటెడ్ డిజిటల్ ఐడెంటిటీ కార్డు జారీ అవుతాయన్నారు. ఈయూ డిప్యూటీ సెక్రటరీ పి.భానుమూర్తి మాట్లాడుతూ ఎంప్లాయిస్ హెల్త్ స్కీం అమలులో ఎదురవుతున్న ఇబ్బందులను ఎండీ ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఈయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పెద్దమజ్జి సత్యనారాయణ, జోనల్ కార్యదర్శి బి.కృష్ణమూర్తి, జోనల్ నాయకులు కె.వి.రమణ, ఎం.సత్యవతి, బి.జనార్దన, ఉమెన్ కమిటీ జిల్లా నాయకులు డి.అరుణ, శ్రీకాకుళం, ఎస్.కోట, విజయనగరం డిపోల అధ్యక్షులు, ఆర్టీసీ ఉద్యోగులు పాల్గొన్నారు.

ప్రైవేటు వాహనాలు రాకుండా ప్రత్యేక డ్రైవ్



కాంప్లెక్స్ ముందు ప్రత్యేక డ్రైవ్ చేస్తున్న ఆర్టీసీ అధికారులు, సిబ్బంది

శ్రీకాకుళం అర్బన్ : జిల్లా కేంద్రమైన శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్స్ ముందు ప్రైవేటు వాహనాలు నిలుపుదల చేయకుండా ఆర్టీసీ అధికారులు మంగళవారం ప్రత్యేక డ్రైవ్ చేపట్టారు. ఆర్టీసీ బస్సుల ఆదాయానికి గండికొడుతూ ప్రయివేటు బస్సులు, ఆటోలు, ఇతర ప్రవేటు వాహనాలు నిలుపుదల చేసి ప్రయాణికులను ఎక్కించుకుపోతున్నారు. దీంతో ఆర్టీసీ బస్సులు ఖాళీగా దర్శనమిస్తున్నాయి. దీంతో శ్రీకాకుళం ఒకటి, రెండు డిపోల మేనేజర్లు పి.మల్లికార్జునరాజు, కేఆర్ఎస్ శర్మ, ఆర్టీసీ సెక్యూరిటీ సిబ్బందితో కాంప్లెక్స్ ముందు ప్రయివేటు వాహనాల నిలుపుదలను అడ్డుకున్నారు. కాంప్లెక్స్ ముందు నిలుపుదల చేయకూడదని ఆర్‌టీవో చట్టం ఉందని, దీనిని అతిక్రమించిన వాహనాలపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని చెబుతున్నారు. కార్యక్రమంలో ఆర్టీసీ ఒకటో డిపో సీఐ వి.రమేష్, ఎస్ఎం కె.నరేంద్ర, ఆర్టీసీ అధికారులు ఎల్ఎస్ నాయుడు, ఐఎస్ రావు, ప్రసాద్, వర్మ, సుమన్, సెక్యూరిటీ సిబ్బంది రామారావు, సూరప్పడు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ హోంగార్డు నిజాయితీ



శ్రీనివాసరావుకు బ్యాగును అప్పగిస్తున్న హోంగార్డు రామయ్య

శ్రీకాకుళం క్రైమ్ : నగరంలోని ఏడు రోడ్ల కూడలిలో ఓ వ్యక్తి పోగొట్టుకున్న బ్యాగును తిరిగి అప్పగించి ట్రాఫిక్ హోంగార్డు తన నిజాయితీ నిరూపించుకున్నారు. శ్రీకాకుళం నగరానికి చెందిన ఆర్ఎంపీ వైద్యుడు ఆర్.శ్రీనివాసరావు విశాఖ వెళ్లి ద్విచక్ర వాహనంపై తిరిగి ఇంటికొస్తుండగా ఏడురోడ్ల కూడలి వద్ద బ్యాగ్ పడిపోయింది. అక్కడే ఉన్న మరో వ్యక్తి బ్యాగును తీస్తుండగా ట్రాఫిక్ హోంగార్డు కె.రామయ్య గుర్తించి ప్రశ్నించగా ఆ వ్యక్తి బ్యాగు ఇచ్చి వెళ్లిపోయాడు. విచారణలో అది శ్రీనివాసరావుదని తెలియడంతో ఫోన్ చేసి బ్యాగ్ అప్పగించారు. బ్యాగులో రూ.5వేలు నగదు, రూ.40 వేలు విలువైన మెడికల్ కిట్ ఉన్నాయి.

కళాకారుల ఎంపిక



ఆడిషన్స్ నిర్వహిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్ : నగరంలోని జెండాలవీధిలో ఈశ్వర్ ఆర్ట్స్ అండ్ డిజిటల్స్ ఆధ్వర్యంలో శ్రీకాకుళం ఫోక్ సాంగ్స్ ఆడిషన్స్ రెండు రోజులుగా నిర్వహిస్తున్నారు. సంగీత దర్శకుడు పెంకి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో నటీనటులను ఎంపిక చేసినట్లు డిజిటల్స్ నిర్వాహకుడు ఎస్.ఈశ్వరరావు తెలిపారు. రెండు జానపదం పాటలు, ఒక వెస్టన్ బీట్ పాటకు శ్రీకాకుళం కళాకారులతో జిల్లా పరిసర ప్రాంతాలలో షూటింగ్ నిర్వహిస్తామని చెప్పారు. బుధవారం కూడా ఎంపికలు జరుగుతాయని తెలిపారు.

హద్దులు గుర్తించాలని వినతి

నరసన్నపేట: స్థానిక సంతపేట ఎదురుగా ఉన్న శ్మశాన వాటికను అన్ని విధాలా అభివృద్ధి చేసేందుకు నరసన్నపేట లయన్స్ క్లబ్ నిర్ణయించిందని క్లబ్ అధ్యక్షుడు సదాశివుని కృష్ణ అన్నారు. శ్మశాన వాటికకు సరిహద్దులు నిర్ణయించి, మార్కింగ్ చేయాలని స్థానిక తహసీల్దార్ పి.కనకరావుకు మంగళవారం వినతిపత్రం అందజేశారు. లయన్స్ క్లబ్ ప్రతినిధులు సదాశివుని కృష్ణ, ఊణ్ణ రంగనాథ్, వి.నాగరాజు, పి.రమేష్ మాట్లాడుతూ స్థానికులతో ఒక కమిటీని వేసి, ఆ కమిటీ ఆధ్వర్యంలో శ్మశాన వాటిక అభివృద్ధి పనులు చేపడతామన్నారు. లయన్స్ క్లబ్ సభ్యులను తహసీల్దార్ అభినందించారు. వీలున్నంత తొందరగా సరిహద్దులు నిర్ణయించి తెలియజేస్తామని హామీ ఇచ్చారు.

● కళాకారులకు సైకత వందనం

ప్రపంచ కళాకారుల దినోత్సవం సందర్భంగా సైకత శిల్పి గేదెల హరికృష్ణ వేసిన సైకత శిల్పం ఆకట్టుకుంటుంది. ఆమదాలవలస మండలంలోని గాజులకొల్లివలస గ్రామం సమీపంలో గల సంగమేశ్వర ఆలయం వద్ద కళాకారులకు వందనం చేస్తున్నట్లు సైకత చిత్రం రూపొందించారు.

- ఆమదాలవలస రూరల్

